ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

సోమవారం 24 నవంబరు 2025

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 18.0

బీచ్‌లో సండే సందడి



కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. తుఫాన్, భారీ వర్షాల కారణంగా కార్తీకమాసం ప్రారంభమైన పక్షం రోజుల పాటు బీచ్ వద్దకు సందర్శకులను అనుమతించలేదు. ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. ఎగసి పడుతున్న అలలతో సమానంగా సముద్ర స్నానం చేసి సేద తీరారు. డీఎస్పీ డాక్టర్ శ్రీవేద ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- మొగల్తూరు(ఆంధ్రజ్యోతి)

భగవత్ స్వరూపుడు సత్యసాయి



సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస వంటి ధర్మాలను ఆచరించి సత్య సాయిబాబా ప్రపంచవ్యాప్తంగా భగవత్ స్వరూపుడుగా పూజింపబడుతున్నారని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.ఆదివారం సత్య సాయిబాబా శత జయంతి వేడుకలను భీమవరం సత్యసాయి మందిరంలో అధికారికంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు..

- 8లో..

29న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

28 కంపెనీలు.. 3 వేల ఉద్యోగాలు

భీమవరం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 29న నిర్వహించే మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. కలెక్టరేట్‌లో ఆదివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోందన్నారు. సుమారు 28 ప్రముఖ కంపెనీలతో పాటు మరికొన్ని ఇతర కంపెనీలలో మొత్తం 3 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించనున్నారు. 18-35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ లింక్ నందు రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూకు హాజరుకావాలని, ఇతర వివరాలకు 8688595244, 9502024765 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్, ఎన్‌సీఎస్ వైపీ కిషోర్ రెడ్డి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పుష్కర ప్రతిపాదనలు

జిల్లాలో రూ.9.90 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక

అభివృద్ధి పనులకు పర్యాటక శాఖ సిద్ధం

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : అఖండ గోదావరి పుష్కరాలకు పర్యాటక శాఖ సిద్ధం అవుతోంది. జిల్లాలో వశిష్ఠ తీర గోదావరి ప్రాంతాల్లో స్నాన ఘాట్‌ల వద్ద రిసార్ట్స్‌లు,ప్లే జోన్‌లను ఏర్పాటు చేయనున్నది. రిసార్ట్‌లను చేరుకోవటానికి బీటీ రహదారులను వేయనున్నారు. వీటికోసం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 2027లో జరిగే గోదావరి పుష్కారాలకు కూటమి ప్రభుత్వం ఇదివరకే అన్ని శాఖలను అప్రమత్తం చేసింది. జిల్లాలోని గోదావరి తీర ప్రాంతంలో అన్ని స్నాన ఘాట్‌ల వద్ద సౌకర్యాల కల్పనకు పర్యాటక శాఖ రూ 9.90 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. ప్రభుత్వానికి నివేదిక పంపించింది.

ప్రతిపాదనలు ఇవే


వలంధర రేవు వద్ద రెస్టారెంట్‌కు మమ్మతులకు రూ4.50 లక్షలు, సిద్ధాంతం హైవే నుంచి దొంగరావిపాలెం బీటీ రోడ్డు రూ.1.50 కోట్లు, పెదమల్లంల్లో రిసార్ట్ అభివృద్ధి రూ.13.50 లక్షలు, సిద్ధాంతం నుంచి పెద్దమల్లం మాచేనమ్మఆలయం బీటీ రోడ్డు నిర్మాణం రూ.4.20 కోట్లు, దొంగరావిపాలెం వద్ద రిసార్ట్ మరమ్మతులకు రూ.9 లక్షలు,పేరపాలెం రిస్టార్ట్ మరమ్మతులకు రూ.7 లక్షలు, ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ గుడివద్ద భక్తుల విశ్రాంతి భవనం రూ.65 లక్షలు, సిద్ధాంతం కేదారేశ్వరస్వామి ఆలయం వద్ద విశ్రాంతి భవనం రూ.15 లక్షలు, దొడ్డిపట్ల పుష్కర్‌ఘాట్ ప్లేజోన్ రూ.15 లక్షలు, నరసాపురం లలితాబాగ్ ప్లేజోన్ రూ.15లక్షలు, వలంధర్ రేవు ప్లేజోన్ రూ.15 లక్షలు, కొండాలమ్మ పుష్కరఘాట్ ప్లేజోన్ రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

నత్తనడకన ఆస్తి పన్ను వసూళ్లు

సచివాలయాల వారీగా అధికారుల సమీక్ష

వచ్చే మార్చి నాటికి నూరు శాతం లక్ష్యం

భీమవరం టౌన్, నవంబరు 23(ఆంధ్రజోతి): మునిసిపాల్టీలో పన్ను వసూళ్లు నత్తడకన సాగుతున్నాయి.. దూకుడు పెంచాలని ప్రభుత్వం ఆదేశించింది. పట్టణాల్లో ఆస్తివన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించింది. గత వారం రోజుల్లో పైసా వసూలు చేయని వార్డు సచివాలయాలను గుర్తించారు. మునిసిపాల్టీలవారీగా సచివాలయాల వివరాలను కమిషనర్లకు వివరించారు. ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని కమిషనర్లను ఆదేశించింది. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి వందశాతం పూర్తి చేయాలని నిర్ణయించింది. ప్రతీ వార్డు సచివాలయంలో ప్రతీరోజు పన్నులు వసూళ్లు చేపట్టాలని ఆదేశించింది. దీనిపై మునిసిపల్ డీఎంఏ, ప్రిన్సిపల్ సెక్రటరీ రెండు రోజుల క్రితం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కమిషనర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మునిసిపాల్టీలకు ఆర్థిక స్వేచ్ఛ నిచ్చింది. గడచిన ఏప్రిల్ 1 వతేదీ నుంచి వచ్చిన ఆదాయంతో అభివృద్ధిపనులను చేసుకోవచ్చునని స్పష్టత ఇచ్చింది. పన్ను వసూళ్లు కాకపోవటంతో అభివృద్ధిపనులకు నిధుల లేమి వెంటాడుతోంది. లక్ష్యాలు నిర్దేశించి పన్నుల వసుళ్ళను పెంచాలని ఆదేశాలు జారీ చేశారు.



మునిసిపాలిటీ	అసెస్‌మెంట్లు	డిమాండ్	వసూలైనది
		(రూ.కోట్లలో..)	
ఆకివీడు	8,368	3.76	1.32
భీమవరం	41,248	39.03	14.22
నరసాపురం	16,940	11.23	3.52
టీపీ గూడెం	27,847	21.59	8.90
పాలకొల్లు	18,080	13.20	4.43
తణుకు	25,413	21.00	9.86
	1,37,896	**89.20**	**42.25**

మబ్బుల అలజడి

సార్వా మాసూళ్ల సమయంలో తుఫాన్‌లు రైతుల్లో అలజడి రేపుతున్నాయి. మొన్న మొంథా తుఫాన్ భయపెట్టింది. నేడు సెలార్ తుఫాన్ పరుగులు పెట్టిస్తున్నది. అల్ప పీడనం ఏర్పడి వాయుగుండంగా బలపడి తుఫాన్‌గా మారుతుందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం నుంచి మబ్బులతో వాతావరణం మారింది. దీంతో రైతులు పరుగులు పెడుతున్నారు. మాసూళ్లైన ధాన్యాన్ని బరకాలతో కప్పుకుంటున్నారు..

భీమవరం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2 లక్షల 16 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకు 60 వేల ఎకరాలు పంట మాసూలైంది. 1 లక్షా 80 వేల టన్నుల ధాన్యం దిగుబడి రాగా 70 వేల టన్నులు కొనుగోలు జరిగింది. ముందుగా 20 వేల టన్నులు మెట్టలో అమ్మకాలు జరిగాయి. దీంతో ఇంకా 80 వేల టన్నుల ధాన్యం రైతుల వద్దే రాశులుగా ఉంది. ఆ ధాన్యాన్ని తేమ శాతం తగ్గించేందుకు ఎండ బెడుతున్నారు. రెండు,మూడు రోజులు ఎండబెడితేనే తేమ శాతం 17 వస్తుంది. మబ్బుల వల్ల ధాన్యం ఎండబెట్టడం వీలుకావడం లేదు. వర్షం పడుతుందనే సూచనలతో ఎండబెట్టిన ధాన్యాన్ని రాశులుగా చేసి బరకాలతో కప్పేశారు.

వరికోత యంత్రాలకు గిరాకీ

మొన్న మొంథా తుఫాన్ వల్ల మాసూళ్ళకు వచ్చిన వరిచేలు 15 రోజులు వెనక్కు వెళ్లాయి. దీంతో ఒకేసారి ఎక్కువ పంట మాసూళ్లకు వచ్చింది. వరికోత యంత్రాలు అన్ని ప్రాంతాలకు అందుబాటులో లేనందున యంత్రాలకు గిరాకీ ఏర్పడింది. గంటకు రూ. 2800 నుంచి 3 వేలు ఆపైన వసూలు చేస్తున్నారు. తుఫాన్ ప్రచారంతో రైతులలో ఆందోళన ఎక్కువైంది.వరికోత యంత్రాల కోసం పరుగులు పెడుతున్నారు.



వాతావరణం మార్పుతో గునుపూడిలో ధాన్యంపై బరకాలు కప్పుకున్న రైతులు

భయపెడుతున్న వాతావరణం

- మొన్న మొంథా...నేడు సేలార్ తుఫాన్
- వరికోత యంత్రాలకు డిమాండ్
- ఇప్పటివరకు 60 వేల ఎకరాల్లో కోతలు
- లక్షా 80 వేల టన్నుల ధాన్యం మాసూళ్లు..
- 70 వేల టన్నులు కొనుగోళ్లు
- 80 వేల టన్నులు పైగా రాశులుగా..

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

ధాన్యం కొనుగోలుకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. గోనెసంచులు సరిపడగా అన్నిచోట్ల అందుబాటులో ఇచ్చారు. జిల్లాలో 308 ఆర్ఎస్‌కేలు ఉన్నాయి. వాటి అవసరమైన వాటిగా 252 ఆర్ఎస్‌కేలలో కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం 220 ఆర్ఎస్‌కేల పరిధిలో వరి పంట మాసూళ్లు జరుగుతున్నాయి. మాసూళ్లు పూర్తయి తేమశాతం సరిపడా ఉంటే వెంటనే కొనుగోలు చేస్తున్నారు.

అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు

రైతులకు ధాన్యం కొనుగోలులో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. సంచులు సరిపడేవి ఏర్పాటు చేశాం. మాసూళ్లు స్పీడుగా జరుగుతున్నాయి. కొనుగోళ్లు ఆ విధంగానే చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో ఆర్ఎస్‌కేలలో కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి

రైతులు ఉరుకులు..పరుగులు

పెనుగొండ/ ఆచంట : ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలతో తరచూ నష్ట పోతున్నామని రైతులు వాపోతున్నారు. వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో రైతుల గుండెల్లో అలజడి మొదలైంది. ధాన్యం ఒబ్బిడి చేసుకునేందుకు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఆచంట మండలంలో ఇపుడిపుడే సార్వా మాసూళ్లు ప్రారంభమయ్యాయి. ఆదివారం వాతావరణం మబ్బులు కనిపించడంతో రైతుల్లో దిగులు ఏర్పడింది. తుఫాన్ వస్తే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు తమ ఆవేదన చెందుతున్నారు.

దిగుబడి పడిపోయింది

మొగల్తూరు (ఆంధ్రజ్యోతి): సార్వా సాగు అరంభం నుంచి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుఫాన్ కారణంగా చేలల్లో నీరు నిలిచిపోయింది. దీంతో దిగుబడిపై ప్రభావం చూపింది. మొగల్తూరు మండలంలో సుమారు 628 ఎకాల్లో వరి సాగు చేయగా 350 ఎకరాల్లో తుఫాన్, అధిక వర్షాలతో పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు.ఎకరానికి 15 నుంచి 20 బస్తాలు కూడా దిగుబడి రాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటి వరకూ ఇన్‌పుట్ సబ్సిడీ ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో పెట్టుబడి పెట్టలేక చేలు కోయాలో లేదో అనే పరిస్థితిలో ఉన్నామని రైతులు అంటున్నారు.



దువ్వలో ధాన్యం ఆరబెట్టి బస్తాల్లో పడుతున్న కూలీలు

ధాన్యం అమ్మకాల్లో జిల్లాకో ధర !

రూ. 100 వరకూ నష్టపోతున్న జిల్లా రైతులు

తణుకు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలు కష్టపడి పండించిన ధాన్యం అమ్మకాల సమయంలో జిల్లాకో విధానంగా అమ్మకాలు జరుగుతున్నాయని దీంతో బస్తాకు రూ. 100 పైగా నష్టపోతన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని రకాల వరి వంగడాలపై పొరుగున వున్న తూర్పు గోదావరి జిల్లాలోని ఒక రేటుతో పాటు ధాన్యం తరలింపులో కూడా అక్కడో విధానం, ఇక్కడో విధానం జరుగుతుందని జిల్లా రైతులు వాపోతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రైతుల వద్ద వున్న ధాన్యాన్ని రైస్ మిల్లర్లే తమ హమాలీలతో వాహనాలలో మిల్లులకు తరలిస్తుండగా పశ్చిమలో మాత్రం రైతులే ఏర్పాటు చేసుకోవలసి వస్తుందంటున్నారు. పొరుగు జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు దళారుల ద్వారా రైతు కళ్లం వద్దే బస్తాకు రూ.1800 చెల్లించి వాహనాల ద్వారానే మిల్లుకు తరలించుకుంటుండగా ఇక్కడ మాత్రం రైతులే వాహనాలు, హమాలీలను ఏర్పాటు చేసుకుని ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తే రూ.1700 చెలిస్తున్నారని రైతులు అంటున్నారు. ధాన్యం తూకం కూడా ప్రభుత్వ కాటాల వద్ద కాకుండా రైస్ మిల్లుల వద్దే తూకం వేయడం వల్ల తమకు అనుమానాలున్నాయని

- మిగతా 8లో..

రైళ్లు ఫుల్ !



- సంక్రాంతి పండుగ ఎఫెక్ట్‌తో నిండుకున్న టిక్కెట్లు
- ప్రధాన రైళ్లకు నో రిజర్వేషన్
- బుకింగ్ తెరుచుకున్న వెంటనే ఫుల్
- ప్రత్యేక రైళ్ల కోసం ఇప్పటినుంచే ఎదురుచూపు

7

చికెన్ సెంటర్ల వద్ద క్యూ



- కొద్దిగా తగ్గిన కూరగాయలు
- ప్రియమవుతోన్న టమాటా
- దిగివచ్చిన వంకాయ



ఐఎస్ జగన్నాథపురంలో పోలీస్ ఉన్నతాధికారులతో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి

నేడు పవన్ పర్యటన

ఐఎస్ జగన్నాథపురంలో ఉప ముఖ్యమంత్రి పర్యటన

ఏర్పాట్లు పరిశీలించిన ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి

ద్వారకాతిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువుదీరిన లక్ష్మీనారసింహుని దర్శనం, పలు అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్.కిశోర్, జేసీ అభిషేక్ గౌడ ఆదివారం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి వచ్చి వెళ్లే వరకూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుకుండా అన్నిచర్యలు తీసుకున్నామన్నారు. ఏఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావస్‌కుమార్, పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, భీమడోలు సీఐ విల్సన్, పాల్గొన్నారు.

పర్యటన ఇలా..

పర్యటనలో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. హెలికాప్టర్‌లో రాజవరం రావల్సిన ఆయన ప్రస్తుతం రోడ్డుమార్గంలో రానున్నట్లు తెలిసింది. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి కొవ్వూరు. దేవరపల్లి, నల్లజర్ల జాతీయ రహదారిపై పోతవరం, ఆరిపాటి, యర్రంపేట, రాజవరం మీదుగా ఐఎస్ జగన్నాథపురం చేరుకుంటారు. ఉదయం 8.30 గంటలకు మాదాపూర్ రెసిడెన్సీ నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి 8.55 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు.10.05 గంట లకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ నుంచి రోడ్డు మార్గంలో 11.40 గంటలకు ఐఎస్ జగన్నాథపురంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్దకు చేరుకుంటారు. 12 గంటలకు స్వామివారి దర్శనం. అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 30 ఎకరాలు భూమి హక్కుపత్రాల అందజేస్తారు.12.35 గంటలకు జగన్నాథపురంలో మేజిక్ డ్రెయిన్లు పరిశీలిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు రోడ్డు మార్గాన చేరుకోనున్నారు. 1.35 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి మంగళగిరి క్యాంపు కార్యాలయానికి చేరుకోనున్నారు.

క్రీడలకు ప్రోత్సాహం



ప్రతి పాఠశాలకు స్పోర్ట్స్ కిట్స్ ఏర్పాటు

మెగా డీఎస్సీలో పీడీ పోస్టులు భర్తీ

విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ

భీమవరం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. జిల్లాలోని 1,375 పాఠశాలలకు క్రీడలకు కావలసిన స్పోర్ట్ కిట్స్ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసింది. దానికి సంబంధించి లిప్ యాప్ అందుబాటులోకి తెచ్చింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులే వారి విద్యార్థులు ఆడే క్రీడలను నిర్ణయించి క్రీడలకు సంబంధించిన కిట్స్ వివరాలు యాప్‌లో పెట్టాలి. రాష్ట్ర విద్యాశాఖకు ఆ వివరాలు అందుతాయి. దానిని బట్టి జోన్‌ల వారీగా నేరుగా పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్స్ అందనున్నాయి. ఇప్పటికే యాప్ ద్వారా వివరాలు పంపించారు. స్పోర్ట్స్ కిట్స్ మరికొన్ని రోజుల్లోనే పాఠశాలలకు చేరనున్నాయి. క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ పలు క్రీడలకు సంబంధించిన కిట్స్ అందించనున్నారు.

పాఠశాలల్లో పీడీ పోస్టుల భర్తీ

గత ఏడాది వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పీడీ పోస్టులు కొన్ని ఖాళీగా ఉండేవి. జిల్లాలోని 175 జిల్లా పరిషత్, ఆరు గవర్నమెంట్ పాఠశాలలు, 25 మునిసిపల్ పాఠశాలలు, 14 ఎయిడెడ్ పాఠశాలల్లో మొన్నటివరకు 43 పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొన్న జరిగిన మెగా డీఎస్సీతో పీడీ పోస్టులు భర్తీ అయ్యాయి. ప్రతి పాఠశాలలోను క్రీడా శిక్షణ ఇచ్చేందుకు పీడీలు అందుబాటులోకి వచ్చారు.

గడిచిన ఐదేళ్లలో క్రీడలు లేవు

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలు మరుగున పడ్డాయి. జోనల్ స్థాయి క్రీడలు విద్యార్థులకు లేకుండా పోయాయి. 2023లో మాత్రం ఆడుదాం ఆంధ్ర అనే క్రీడలను తీసుకువచ్చింది. అయితే వాటిలో పాఠశాల పిల్లలకు అవకాశం ఇవ్వలేదు. 17 సంవత్సరాల్లోపు విద్యార్థులు ఆటలు ఆడేందుకు యాప్‌లో ఎక్కించుకోవాలనుకునే వీలులేకుండా చేశారు. క్రీడల భారమంతా పంచాయతీల మీద వేశారు. దీంతో ఆ సమయంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడలు లేవు.

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం



ప్రభుత్వం క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నది. పాఠశాలకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందించే ఏర్పాటు చేసింది. దీంతో క్రీడాకారుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరిగింది. మా స్కూల్ క్రీడాకారుడు ఇటీవలే అండర్-17 స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయి వాలీబాల్‌లో మెడల్ సాధించారు.

- బి.గంగా మహేష్, బేతపూడి జడ్పీ హైస్కూల్ పీడీ

పాఠశాలలో శిక్షణ బాగుంది



అండర్-17 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచాను. బ్రాంజ్ మెడల్ సాధించాను. జాతీయ స్థాయిలో రాణించాలన్నదే నా గోల్. మా పాఠశాలలో శిక్షణ వల్లనే ఈ స్థాయికి వచ్చాను. పీడీ ప్రోత్సాహం బాగుంది.

- బుంగా మహి, బేతపూడి పాఠశాల

నేడు క్రికెట్ అండర్ -14, 17 విభాగాల్లో
ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు

ఏలూరు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల హైస్కూళ్ల విద్యార్థులకు క్రికెట్ అండర్-14, 17 బాలురకు జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం పెదవేగి మండలం వంగూరులోని ఏఎస్ఎం క్రికెట్ అకాడమీలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రీడాదుస్తులు, బ్యాట్, బాల్, ప్యాడ్, వాటర్ బాటిల్‌తో సహా క్రీడాకారులు హాజరు కావాలన్నారు. వివరాలకు 81433 96604, 98853 24848 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం డిసెంబరు మూడో తేదీని పురస్కరించుకుని ఈనెల 25న విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి పలు క్రీడా విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని, పోటీలను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ప్రారంభిస్తారని తెలిపారు.


ఏలూరు జిల్లా నూతన కార్యవర్గానికి ఎన్నికైన పీఎస్‌హెచ్‌ఎంలు

'పీఎస్‌హెచ్‌ఎం'ల ఫోరం జిల్లా నూతన కార్యవర్గం

ఏలూరుఅర్బన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): 'పీఎస్‌హెచ్‌ఎం' ఫోరం ఏలూరు జిల్లా శాఖ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.శ్రీనివాసరావు(ఎంపీపీఎస్, రామసింగవరం, పెదవేగి మండలం), కె.నాగేశ్వరరావు (ఉంగుటూరు) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక పవర్‌పేటలోని మున్సిపల్ ప్రాథమి కోన్నత పాఠశాలలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల (పీఎస్‌హెచ్‌ఎం) ఫోరం జిల్లాశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా ఎం.పోతురాజు(కె.ముప్పర్రు, పెదపాడు), సహ అధ్యక్షుడిగా ఎన్.కొండయ్య(అన్నేవారిగూడెం, భీమడోలు) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్(అడవికొలను, నిడమర్రు), అదనపు కార్యదర్శిగా ఎ.మురళీకృష్ణ(పూళ్ల) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అనంతరం జరిగిన సంఘ తొలి సమావేశంలో పీఎస్‌హెచ్‌ఎం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం తొలిసారిగా ఏర్పాటుచేసిన పీఎస్‌హెచ్‌ఎం వ్యవస్థ లక్ష్యాన్ని నెరవేర్చడానికి హెచ్‌ఎంలు కృషిచేయాలని కోరారు.

స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తులు

ఏలూరు క్రైం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ పోస్టులకు తాత్కాలిక పద్ధతిపై భర్తీకి ప్యానెల్‌లో తమ పేర్లను చేర్చడం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ పోస్టులు-4 ఖాళీగా ఉన్నాయని, సదరు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను నిర్దేశించిన దరఖాస్తు ఫారంలో, అర్హతల ధ్రువీకరణ పత్రాలు నకళ్లు అటెస్ట్ చేసినవి, ఫొటోలు మూడు ప్రతులతో జిల్లా జడ్జి, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వారి కార్యాలయంనకు డిసెంబరు 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అందేలా పంపాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.45 వేల గౌరవ వేతనం చెల్లిస్తారన్నారు. వివరాలకు నోటిఫికేషన్‌ను జిల్లా కోర్టులో, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ కార్యాలయాలు, బార్ అసోసియేషన్‌లలోని నోటీసు బోర్డులో ప్రదర్శనకు ఉంచడం జరుగుతుందన్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంత్యుత్సవాలు


సత్యసాయి చిత్రపటం వద్ద నివాళులు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలు తాడేపల్లిగూడెంలోని వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ ఆవరణలో ఘనంగా ఆదివారం నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, అధికారులు సత్యసాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని సత్యసాయి మందిరంలో నగర సంకీర్తన, సత్యసాయి వ్రతాలు, భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆకుల నవీన్‌బాబా, ప్రవా శ్రీనివాస్, గాదే శ్రీరామచంద్రమూర్తి పాల్గొనారు.

లండన్ టెక్నాలజీతో వ్యవసాయ క్షేత్రం ప్రారంభం


వ్యవసాయ క్షేత్రాన్ని ప్రారంభించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లండన్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంజనీరింగ్ చేసిన ఆరుళ్లకు చెందిన మాకరాజు హేమంత్ వర్మ అధునాతన లండన్ టెక్నాలజీతో నిర్మించిన నూతన వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ టెక్నాలజీతో మట్టి, ఎరువులు, పురుగు మందులు అవసరం లేకుండా కూరగాయలు, స్ట్రాబెరి, మెడిసిన్ ప్లాంట్స్ ఏర్పాటుచేశారు. ఈ వ్యవసాయ క్షేత్రాన్ని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి రఘురాం నాయుడు ప్రారంభించారు. ఎంపీపీ పి.శేషులత, మాజీ సర్పంచ్ మాకరాజు సతీష్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


కృష్ణా జిల్లా బాలుర విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నాయకులు

అండర్-17 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ విజేతలు
'కృష్ణా, తూర్పు గోదావరి జట్లు'

నూజివీడు టౌన్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 69వ అండర్-17 బాస్కెట్‌బాల్ విజేతలుగా కృష్ణా, తూర్పుగోదావరి జిల్లా జట్లు నిలిచాయి. నూజివీడు బేతస్త ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాస్కెట్‌బాల్ బాల బాలికల టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. దీనిలో బాలుర విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలవగా, బాలికల టోర్నమెంట్‌ను తూర్పుగోదావరి జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం నిర్వహించిన ఫైనల్లో బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు 18-39 స్కోర్‌తో విజయకేతనం ఎగురవేసింది. రెండో స్థానంలో తూర్పుగోదావరి జిల్లా, మూడో స్థానంలో గుంటూరు జిల్లా, నాలుగో స్థానంలో చిత్తూరు జిల్లా జట్లు నిలిచాయి.

ఇక బాలికల విభాగంలో గుంటూరు జట్టుపై 6-23 స్కోర్‌తో తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో గుంటూరు జట్టు, మూడో స్థానంలో విశాఖపట్నం జిల్లా, నాలుగో స్థానంలో కృష్ణా జిల్లా జట్లు నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి నూజివీడు డీవైఈవో సుధాకర్, పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపికైన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు డిసెంబర్ నెలలో ఛత్తీస్‌గడ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు తెలిపారు. కృష్ణా జిల్లా బాలుర అండర్-17 విభాగంలో వరుసగా 8వసారి మొదటి ప్లేస్ సాధించారన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్ పి.కృష్ణ, 13 ఉమ్మడి జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు, సబ్జెక్ట్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైళ్లు ఫుల్

సంక్రాంతి పండుగ రద్దీతో నిండుకున్న టిక్కెట్లు



కిటకిటలాడుతున్న రైల్వేస్టేషన్(ఫైల్)

సంక్రాంతి పండగకు ఈసారి ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పలు పట్టణ, గ్రామాలకు రైళ్లలో వచ్చేందుకు ప్రయత్నించిన ప్రయాణికులందరికీ నిరాశే మిగిలింది. 60 రోజుల ముందుగానే టిక్కెట్లు నిండుకున్నాయి. ఇటు బుకింగ్‌లు తెరిచిన రోజు దగ్గర నుంచి ఇదే రద్దీ. అటు జనవరి 8 నుంచి తిరుగు ప్రయాణంలో జనవరి 17 నుంచి ఇదే సీన్ కొనసాగింది. ప్రస్తుతం అన్నిరైళ్లకు స్లీపర్, ఏసీ తరగతుల్లో రిగ్రెట్ చూపిస్తున్నది. అంటే నో టిక్కెట్ అని అర్థం. కనీసం వెయిటింగ్ లిస్టు టిక్కెట్‌లు కూడా రావడం లేదు. 'దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు ఏవిధంగా రావాలి' అనే దానిపై ప్రయాణికుల్లో ఇప్పటి నుంచే టెన్షన్ నెలకొంది. టిక్కెట్లు దొరకని ప్రయాణికులంతా స్పెషల్ రైళ్ల కోసం ఎదురు చూస్తున్నారు.

- ప్రధాన రైళ్లకు నో రిజర్వేషన్
- బుకింగ్ తెరుచుకున్న వెంటనే ఫుల్
- ప్రత్యేక రైళ్ల కోసం ఇప్పటినుంచే ప్రయాణికుల ఎదురుచూపు

నరసాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా సంక్రాంతికి ఉమ్మడి పశ్చిమ జిల్లా మీదుగా నడిచే అన్ని రైళ్లకు మంచి డిమాండ్ ఉంటుంది. స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికులంతా ముందుగా అప్రమత్తంగా ఉంటారు. గతంలో రిజర్వేషన్ 90 రోజుల ముందుగా ఉండేది. ప్రస్తుతం దాన్ని 60 రోజులకు కుదించారు. ఈ లెక్కగట్టి ప్రయాణికులు టికెట్లు బుక్ చేసుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి వంటి నగరాల నుంచి జిల్లాకు వచ్చే రైళ్లన్నీ నిండుకున్నాయి. వీటికి 60 రోజుల ముందు నుంచి టిక్కెట్ రిజర్వేషన్ చేయించుకోవడం మొదలు పెట్టారు.

ఈ కారణంగా జనవరి 8 నుంచి 13 వరకు ఏ రైళ్లకు టిక్కెట్లు లేవు. తిరుగు ప్రయాణంలో 17 నుంచి 21 వరకు ఇదే సీన్ ఉంది. ప్రధానంగా నరసాపురం నుంచి నడిచే లింగంపల్లి, నాగర్‌సోల్, విశాఖ, గోదావరి, శేషాద్రి, గౌతమి వంటి ఎక్స్‌ప్రెస్‌లకు కనీసం వెయిటింగ్ లిస్టు టిక్కెట్ కూడా దొరకని పరిస్థితి నెలకొంది.

రిజర్వేషన్లు ఇలా..

- లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 9 నుంచి 13 వరకు రిగ్రెట్ చూపిస్తున్నది. 14న స్లీపర్‌లో 16 వెయిటింగ్ లిస్టు ఉంది.ఏసీలో 14న 10 వెటియింగ్ లిస్టు చూపిస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలుకు 17, 18, 19వ తేదీల్లో రిగ్రెట్ ఉంది. 20న స్లీపర్ 150 వెయిటింగ్ లిస్టు ఉండగా ఏసీలో 20న 13 వెయిటింగ్ ఉంది.
- శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌కు బెంగళూరు నుంచి 9, 10, 11, 12 తేదీల్లో స్లీపర్, ఏసీ తరగతుల్లో రిగ్రెట్ ఉంది. 13న స్లీపర్ 36, ఏసీ 14 వెటియింగ్ లిస్టు చూపిస్తుంది. తిరుగు ప్రయాణంలో 17, 18, 19 తేదీల్లో ఏసీ, స్లీపర్ రిగ్రెట్ ఉంది. 20న వెయిటింగ్ లిస్టు స్లీపర్‌లో 34, ఏసీలో 10 చూపిస్తుంది.
- ఇక పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా నడిచే సర్కార్‌లో 9. 10, 11, 12వ తేదీల్లో ఏసీ, స్లీపర్‌లో రిగ్రెట్ ఉంది. 13న స్లీపర్‌లో వెయిటింగ్ లిస్టు 200 ఉంటే ఏసీ 70 ఉంది. తిరుగు ప్రయాణంలో 17, 18, 19 తేదీల్లో ఏసీ, స్లీపర్‌లో రిగ్రెట్ కనిపిస్తుంది. 20న స్లీపర్‌లో 20 టికెట్లు దొరుకుతున్నాయి.
- గౌతమి ఎక్స్‌ప్రెస్.. ఏలూరు జిల్లాలోని ఏలూరు, టీపీగూడెం మీదుగా నడిచే గౌతమిలో 8,9,10,11,12వ తేదీల్లో ఏసీ, స్లీపర్ రీగ్రీట్ ఉంది. 13న వెయిటింగ్‌లిస్టు కనిపిస్తుంది. తిరుగు ప్రయాణంలో 20న స్లీపర్‌లో 130 వెయిటింగ్ లిస్టు ఉంది.
- గోదావరి రైలుకు సికింద్రాబాద్ నుంచి నడిచే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లోనూ ఇదే సీన్ ఉంది. 9 నుంచి 13 వరకు ఈ రైలులో రిగ్రెట్ కనిపిస్తుంది. తిరుగు ప్రయాణంలో 20 వరకు నో టిక్కెట్. ఇక నాగర్‌సోల్, విశాఖ వంటి ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి జిల్లా వరకు ఇదే సీన్ కనిపిస్తుంది.

స్పెషల్ రైళ్లను ముందుగా ప్రకటించాలి



ప్రతి ఏడాది పండుగలకు ముందుగా టికెట్లు నిండకోవడం సర్వసాధారణం. అయితే రైల్వే స్పెషల్ రైళ్లను జనవరి ఆరంభంలో ప్రకటిస్తుంది. దీనివల్ల చాలామందికి టికెట్లు దొరకడం లేదు. ఈసారి ఈ విధంగా కాకుండా ముందుగా ప్రకటించాలి. డిమాండ్ ఉన్న రూట్లలో ఎక్కువ రైళ్లు నడపాలి.

- సీహెచ్ బాలాజి, నరసాపురం


ఆలయంలో కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్న బాలలు, మహిళలు

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దివ్యక్షేత్రం ద్వారకాతిరుమల ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివాహాలు జోరుగా జరగుతుండడం, శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మార్గశిరం ప్రారంభం కావడంతో పాటు అందరికీ సెలవు రోజు అవడం వల్ల ఉదయం నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దేవస్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. 15 వేల మందికి పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. సాయంత్రం నుంచి రద్దీ కాస్త తగ్గుముఖం పట్టింది.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

చినవెంకన్న ఆలయ అనివేటి మండప ప్రాంతంలో ఆదివారం బాలలు, మహిళలు నిర్వహించిన కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. పెద చింతలపూడికి చెందిన శ్రీరాధాకృష్ణా కోలాట బృందం బాలలు, మహిళలు ముందుగా సంప్రదాయ దుస్తులు ధరించి క్షేత్రానికి వచ్చి కోలాటాలు జరుపుతూ స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు.

చెరువులో చనిపోయిన చేపలను తొలగించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చనిపోయిన చేపలను తీస్తున్న కూలీలు

పాలకోడేరు, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): విస్సాకోడేరు పంచాయతీ చెరువులో 'చనిపోయిన చేపలు- దుర్వాసన వెదజల్లుతున్న తాగునీరు' అంటూ ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి విస్సాకోడేరు పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలో తాగునీరందించే మంచినీటి చెరువులో చేపలు చనిపోయి తేలడంతోపాటు దుర్వాసన వెదజల్లడంతో సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ నేతృత్వంలో ఆదివారం పంచాయతీ సెక్రటరీ పవన్‌కుమార్, సిబ్బంది చెరువులో తేలియాడుతున్న చేపలను కూలీల సాయంతో బయటకు తీయించారు. ఉన్నతాధికారుల సూచనలతో చెరువులో కలుషితమైన జలాలను ఇంజన్ల సాయంతో బయటకు తోడించారు. ఈ కార్యక్రమాన్ని ఈవోపీఆర్‌డీ రామ్‌ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పర్యవేక్షించారు.

మాంసం ప్రియులకు పండుగ

- కార్తీక మాసం ముగియడంతో నాన్‌వెజ్‌కు 'ఆదివారం' క్యూకట్టిన జనం
- చికెన్ షాపుల వద్ద సందడి
- కొద్దిగా తగ్గిన కూరగాయల ధరలు
- ప్రియమవుతోన్న టమాటా.. దిగివచ్చిన వంకాయ
- స్థిరంగా ఉల్లిపాయలు



తాడేపల్లిగూడెంలోని చికెన్ సెంటర్ వద్ద జనం

కార్తీకమాసం ముగిసిన అనంతరం వచ్చిన ఆదివారం ఒక్కసారిగా చికెన్ షాపుల వద్దకు మాంసాహారులు ఎగబడ్డారు. 32 రోజుల పాటు వీటికి దూరంగా ఉన్నవారు ఆదివారం ఎక్కడ చూసిన చికెన్, మటన్, చేపలు, రొయ్యల దుకాణాల వద్ద కొనేందుకు క్యూకట్టారు. ఆయా ఈ ప్రాంతాల్లో సందడి నెలకొంది. విశేషమే మిటంటే వీటి ధరలు పెరగక పోవడమే. ఈ వారం ధరలు పెరగవని వచ్చేవారం నుంచి చికెన్ ధరలు పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

తాడేపల్లిగూడెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) కార్తీక మాసం ప్రభావంతో మార్కెట్‌కు అవసరాలకు అనుగుణంగా మాత్రమే కార్పొరేట్ సంస్థలు సరఫరా చేసేవారు. అయితే వీరు పెంచిన కోళ్ల సైజు విపరీతంగా ఫారంలలో ఇప్పటికే పెరిగి ఉన్నాయి. ఈ స్టాక్ తగ్గేవరకు ధరలు పెరగవని చెబుతున్నారు. పెరిగిన కోళ్లను పూర్తిగా మార్కెట్‌కు పంపేసిన తరువాత చికెన్ రేటు పెరుగుతుందని చెబుతున్నారు. ఆదివారం ఒక్కరోజునే పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 110 టన్నుల చికెన్, ఏలూరు జిల్లాలో 65 టన్నుల చికెన్ వినియోగమైనట్టు వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా మటన్ కంటే సామాన్యులు కోడి మాంసాన్నే ఎక్కువగా ఇష్టపడతారు. వారి ఆర్థిక పరిస్థితులకు అనువుగా చికెన్ ధర అందుబాటులో ఉండటం దీనికి కారణం. మటన్ కొనుగోలు చేయాలంటే కిలో రూ.1000 పెట్టాలి. అదే స్కిన్‌లెస్ చికెన్ అయినా రూ.220కు మించి ఉండదు. ఈ మేరకు మధ్యతరగతి, బలహీన వర్గాలవారు చికెన్ కొనుగోలుకే ఎక్కువ ఇష్టపడతారు.

దిగివస్తున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు దిగివస్తున్నాయి. రైతు బజారు కాకుండా మార్కెట్లో ఉల్లిపాయ కాకుండా మిగిలిన కూరగాయల ధరలు గత వారం కిలో రూ.80పైనే విక్రయించారు. ఈ వారం మాత్రం దాదాపు అన్ని కూరగాయల ధరలు కిలోకు రూ.20 తగ్గాయి. కిలో రూ.120కు వెళ్లిన వంకాయలు ఇప్పుడు రూ.80కు పడింది. రూ.100 వరకు వెళ్లిన బీర ఇప్పుడు రూ.70, దొండ, బెండ, దోస కాయలు రూ.80 వరకు వెళ్లాయి ఇప్పుడు అవి రూ.60కు తగ్గాయి. క్యారెట్, బీట్‌రూట్ మాత్రం స్థిరంగా రూ.80 వద్దనే ఉన్నాయి. ఆకాకర, క్యాప్సికమ్ రూ.120కు విక్రయిస్తున్నారు. కాకర రూ.60, అరటి జత రూ.20, ఆనభకాయ రూ.30, పొట్ల కాయ రూ.40కు అమ్మకాలు జరిగాయి.

ఆకాశాన్నంటిన మునగ..

మార్కెట్లో మునగకాడ ధరలు ఆకాశాన్నంటాయి. ఎన్నడూ లేని విధంగా కిలో రూ.250కు విక్రయిస్తున్నారు. రిటైల్‌గా జత రూ.50కు అమ్మారు. గత నెలలో ఇదే మునగ జత రూ.35 నుంచి రూ.40 మధ్యలో విక్రయాలు జరిగాయి. ఇప్పుడు కిలో రూ.250 చేరడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. మొంథా తుఫాన్ ప్రభావంతో మునగతోటలు దెబ్బతిని విరిగిపోవడం, పూత రాలిపోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు.

టమాటా అ'ధర'హో..



టమాటా ధరలు పెరుగుతున్నాయి. గత నెలలో కిలో రూ.20 ఉండేవి.. ఇప్పుడు రూ.60కు చేరింది. మదనపల్లి, చిత్తూరు, బెంగళూరు నుంచి వచ్చే టమాటా తక్కువగా దిగుమతి కావడంతో ధర పెరిగింది. 23 కిలోలు ఉండే ట్రే రూ.1500కు కొనుగోలు చేయాల్సి వస్తుందని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. ఇదే ట్రేను మదనపల్లి మార్కెట్లో గత నెలలో రూ.200లకు రైతుల వద్ద నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు టమాటాకు దిగుబడి తక్కువగా ఉండడంతో మంచి డిమాండ్ ఏర్పడింది.

స్థిరంగా ఉల్లి ధరలు

మార్కెట్లో ఉల్లి ధరలు స్థిరంగానే ఉన్నాయి. గత వారంతో పోల్చుకుంటే వ్యత్యాసం ఏమీ లేదు. మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి 5 లారీలో 154 టన్నుల ఉల్లి వచ్చింది.. ఈ ఉల్లి మధ్యరకంగా ఉండడంతో క్వింటా రూ.1300 నుంచి రూ.1500 మధ్య అమ్మకాలు జరిగాయి. నాణ్యమైన ఉల్లి రూ.1800 నుంచి 2000 మధ్యలో అమ్మారు. ఇక రిటైల్‌గా నాణ్యమైన ఉల్లి రూ.100 నాలుగు కిలోలు, మధ్యరకం ఉల్లి రూ.100కు 5కిలోలు, సాధారణ రకం ఉల్లి రూ.100కు 6 కిలోలు వంతున అమ్మారు.

క్రైం సమాచారం

వేర్వేరు చోట్ల నలుగురి మృతి

ఆగిన లారీని ఢీకొట్టి
మోటారు సైక్లిస్టు మృతి

భీమవరం క్రైం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన తాళ్ళూరి శామ్యూల్‌రాజు(21) పెయింటింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 22న రాత్రి పెయింటింగ్ పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టి మృతి చెందాడు. మృతుడి తాత ప్రభుదాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భీమవరం క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధుడు ప్రమాదవశాత్తు రోడ్డుపై పడి గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ హెచ్‌సీ వెంకటరెడ్డి తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం కొమరాడ గ్రామానికి చెందిన రాట్నాల చినదేవయ్య(75) ఈనెల 21న గొల్లవానితిప్ప గ్రామం నుంచి కొమరాడ వెళ్తున్నాడు.ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి మనుమడు రామాయణం సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..


టి.నరసాపురం, నవంబరు 23 : కలుపు మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. బొర్రంపాలెం గ్రామానికి చెందిన నేటి కిరణ్ కుమార్ (18) చదువు మానేసి ప్రస్తుతం కూలి పనులకు వెళుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై బాధ్యతారాహిత్యంగా తిరుగుతుండడంతో తండ్రి మందలించాడు. ఈనెల 21వ తేదీన బొర్రంపాలెం గ్రామ శివార్లలో గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యానికి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సుధాకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు.

వాగులో పడి టెన్త్ విద్యార్థి మృతి


యశ్వంత్ (ఫైల్)

జీలుగుమిల్లి, నవంబరు 14 : (ఆంధ్రజ్యోతి) : ఓ వాగులో పడి ఈత రాక విద్యార్థి మృతి చెందిన ఘటన జీలుగుమిల్లి మండలం బొత్తప్పగూడెం వద్ద జరిగింది. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట శివారు దొంతిగుంటకు చెందిన గుమ్మళ్ల విజయ్, లిజి దంపతుల చిన్న కుమారుడు యశ్వంత్(15) అశ్వారావు పేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సరదాగా ఐదుగురు మిత్రులు కలిసి కామయ్య పాలెం పంచాయతీ బొత్తప్పగూడెం సమీప వాగులో స్నానానికి దిగారు. వీరిలో యశ్వంత్‌తోపాటు మరో ఇద్దరు స్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తు మునిగిపోతుండగా వాగు ఒడ్డున ఉన్న మరో ఇద్దరు కేకలు వేశారు. ఆ కేకలు విన్న సమీప పొలాల్లో పనిచేసేవారు వచ్చి ముగ్గురిని బయటకు లాగారు. ఇద్దరు ప్రాణాలతో ప్రమాదం నుంచి బయట పడగా యశ్వంత్ అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వాగు వద్దకు వచ్చి బోరున విలపించారు. మృతదేహాన్ని తీసుకువెళ్లారు. ఈ విషయమై హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణను వివరాలు అడగ్గా ఫిర్యాదు రాలేదన్నారు.

బీచ్‌లో బీటెక్ విద్యార్థి గల్లంతు


గణేష్ (ఫైల్)

మొగల్తూరు, నవంబరు23(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం బీచ్‌లో స్నానానికి దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఏలూరులోని కొత్తపేటకు చెందిన మునగాల మోహనసాయిగణేష్ అనే 18 ఏళ్ల యువకుడు విజయవాడలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ముగ్గురు స్నేహితులతో కలిసి బీచ్‌కు వచ్చిన అతడు సముద్రంలో స్నానానికి దిగిన కొద్దిసేపటికే అలల ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎస్ఐ జి.వాసు, మెరైన్ ఎస్ఐ పి.సోమశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో గాలింపు చర్యలు చేపట్టారు.


టిడ్కో గృహాల వద్ద సాక్షులను విచారిస్తున్న సీఐడీ ఏఎస్పీ అస్మఫర్హీన్ (రాజమండ్రి)

మంత్రి నిమ్మలపై దాడి ఘటనపై సీఐడీ విచారణ

- 2022లో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కుట్ర
- అప్పట్లో కేసు నమోదు చేయని పోలీసులు

పాలకొల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి నిమ్మల రామానాయుడుపై జరిగిన దాడి ఘటనపై పాలకొల్లులో ఆదివారం సీఐడీ బృంద సభ్యులు, రాజమండ్రి సీఐడీ ఏఎస్పీ అస్మఫర్హీన్ నేతృత్వంలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆనాడు జరిగిన సంఘటన ప్రాంతమైన టిడ్కో గృహాల కాలనీ వద్ద లబ్ధిదారులు, సాక్షులను విచారణ చేశారు. ఆనాడు దాడి చేసిన సంఘటనపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆనాటి ఫిర్యాదును కేసుగా నమోదు చేశారు. 2022లో వైసీపీ ప్రభుత్వం పట్టణంలోని టిడ్కో గృహాల కాలనీ వద్ద జరిగిన గృహాల పంపిణీ కార్యక్రమంలో సభావేదిక వద్ద వైసీపీ నాయకుల పెద్దల కుట్రపూరిత పథకం ప్రకారం సభకు అధ్యక్షత వహించాల్సిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుతో పాటు అప్పటి ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితర టీడీపీ వారిని వేదికపైకి ఎక్కుతుండగా కిరాయి మూకలను స్టేజీమీదకు ఎక్కించి నిమ్మలను హతమార్చాలని కత్తి వంటి ఆయుధం ఉపయోగించారని, తీవ్ర పదజాలంతో దూషిస్తూ గెంటివేడంతో వేదిక కిందకు పడిపోయారని తెలిపినట్టు సమాచారం. దాడికి పాల్పడిన వ్యక్తి నుంచి ఆనాడు కత్తిని స్వాధీన పరుచుకున్నారని విచారణలో తెలిపారు. ఈ ఘటనపై అప్పట్లో తాడి శశిధర్ పాలకొల్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, ఆనాటి వైసీపీ నాయకుల ఒత్తిడితో పోలీసులు కేసు నమోదు చేయలేదు. సీఐడీ బృందం విచారణలో నరసాపురం డీఎస్పీ శ్రీవేద, పట్టణ సీఐ కె.రజనీకుమార్ ఉన్నారు.

బాలుడి మృతితో డిప్పకాయలపాడులో విషాదచాయలు



కొయ్యలగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అప్పటివరకు బోసి నవ్వులతో ఆడుకున్న బాలుడు అకాలమరణంతో ఆ తల్లిదండ్రుల రోదన అంతా ఇంతా కాదు. డిప్పకాయలపాడులో ఉగ్గం విష్ణు, జ్యోతికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు సౌర్య(2) శనివారం మృతి చెందాడు. అయితే తండ్రి నడుపుతున్న ట్రాక్టర్ కిందే పడి మృతి చెందడంతో తండ్రి రోదన పలువురిని కంట తడి పెట్టించింది. రెండేళ్ల బాలుడు మృతి చెందడంతో గ్రామస్థులంతా కన్నీటి పర్యంతం అయ్యారు. తల్లిదండ్రులు ఉగ్గం విష్ణు, జ్యోతి బోరున విలపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని గ్రామస్థులంతా ఓదార్చారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

నేడు, రేపు తాగునీటి సరఫరా ఉండదు

తణుకు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు కొమ్మాయి చెర్వు గట్టు ఏరియాలో రిజర్వాయర్ మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డెలివరీ వాల్వులు మరమ్మతుల కారణంగా 9, 10, 11, 12, 18, 19, 20 వార్డుల పరిధిలో ఈ నెల 24, 25 తేదీల్లో నీటి సరఫరా ఉండదని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ధర్నా, గెజిట్ పత్రాల దహనం

తణుకు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయకపోతే పాలకులు తగిన గుణపాఠం నేర్చుకోక తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీ.వీ.ప్రతాప్ హెచ్చరించారు. ఆదివారం వాన్‌బరీ పరిశ్రమ వద్ద ధర్నా, గెజిట్ పత్రాలు దహనం చేశారు. కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్సు రద్దు చేయాలని, మోడి కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని నినాదాలు చేశారు.



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

సేవాగుణానికి ప్రతీక ఆర్యవైశ్యులు : నిమ్మల

పాలకొల్లు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సేవా గుణానికి ఆర్యవైశ్యులు ప్రతీకగా నిలుస్తారని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక శ్రీక్షీరపుర అన్నదాన సమాజం నూతన పాలక వర్గ కమిటీ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ముందుగా రూ. 20 లక్షలతో నిర్మించిన అన్నదాన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అన్నదాన సమాజం చైర్మన్‌గా తెలనాకుల కోటేశ్వరరావు, ట్రస్టీలుగా చెరుకూరి శ్రీనివాసరావు, పోతుల ఉమాశంకరరావు, తోట వెంకటేశ్వర్లు, గుగ్గిలపు రామకృష్ణ, నలాది సృజన, ఇంటి క్రాంతి, చామంతుల లీలావతి, బొద్దాని అశ్విని, ఎంజీఎస్ఎస్‌వీపి కిరణ్మయి, కనితి లక్ష్మీలచే మంత్రి నిమ్మల ప్రమాణ స్వీకారం చేయించారు. పెద్దగోపురం ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, కూటమి నేతలు పాల్గొన్నారు.

సబ్ డివిజన్‌కు ఒక క్లూస్ టీం : డీఎస్పీ



నరసాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేరాలను త్వరితగతిన పరిష్కరించేందుకు సబ్ డివిజన్‌కు ఒక క్లూస్ టీమ్ వాహనాన్ని కేటాయించినట్లు డీఎస్పీ శ్రీవేద విలేకర్లకు తెలిపారు. ఈ క్లూస్ టీమ్‌లో ఒక హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు ఇద్దరు సిబ్బంది ఉంటారని, నేరం జరిగిన వెంటనే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుంటా రన్నారు. ఈ వాహనంలో పనిచేసే సిబ్బందిని క్రైం స్పాట్ టీమ్ లేదా క్లూస్ టీమ్ సిబ్బందిగా పిలుస్తారన్నారు. దొంగతనం, మర్డర్, అనుమానస్పద మృతి, ఉరి తదితర సంఘటనలు జరిగినప్పుడు ఈ టీమ్ అక్కడికి చేరుకుంటుందన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ



పెనుమంట్ర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెనుమంట్రలో భూపతిరాజు శ్రీనివాస రాజు, సాయి గీత దంపతులు నిర్మించిన బ్రహ్మర్షి పత్రీజీ ధ్యానమందిరం వద్ద ఉచిత ధ్యానశిక్షణలో హైదరాబాద్‌కు చెందిన వారణాసి పద్మలత పాల్గొని అందరితో సామూహిక ధ్యానం చేయించారు. జగపతిరాజు మాట్లాడుతూ వచ్చేఏడాది ఫిబ్రవరి 2 నుంచి 11 వరకు విశాఖ జిల్లాలో నిర్వహించే మహాకరుణ - ధ్యానమహాయజ్ఞంకు అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు మేకా వెంకటేశ్వరరావు, పిరమిడ్ ధ్యానులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యులు, డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ వైద్యులు డా.నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు, ఉండ్రాజవం, వేలివెన్ను ప్రాంతాల్లో పర్యటించి ఎనిమిది మందికి వైద్య సేవలందించారు. సభ్యులు రెడ్డి అప్పారావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేసారు. కోశాదికారి అర్జి భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జీర్ణకోశ వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం

భీమవరంటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెంటే వారి తోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో జీర్ణకోశ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వసుధ ఫౌండేషన్ కార్యదర్శి ఇందుకూరి ప్రసాద రాజు మాట్లాడుతూ గ్యాస్ట్రో ఎంటరాలజీ డాక్టర్ పిఎస్ఆర్ అనీష్ 58 మంది రోగులను పరీక్షించారని రోగులకు ఉచితంగా మందులు అందించామని, దక్కన్ ఫైన్ కెమికల్స్ ఎస్.ఎల్.జి. హాస్పిటల్, మానవత, దాతల సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరం ని ర్వహించామని తెలిపారు. మానవతా చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, గౌరవ డైరెక్టర్ పెన్మెత్స రామ్మోహన వర్మ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడు సత్యకు జోగయ్య పరామర్శ




పాలకొల్లు, నవంబ రు 23 (ఆంధ్రజ్యోతి): జనసేన రాష్ట్ర కార్య దర్శి బొలిశెట్టి సత్యనారాయణ (సత్య) భార్య నాగమణి ఇటీవల మరణించడంతో మాజీ ఎంపీ హరిరామ జోగయ్య ఆదివారం విశాఖలోని సత్యనారాయణ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. పర్యవరణ పరిరక్షణలో సత్య దంపతులు ఎంతగానో కృషి చేశారని జోగయ్య అన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తాం: వర్మ



కార్యకర్త లక్ష్మీ శ్రీనివాస్ ఇంటి నిర్మాణానికి మంత్రి వర్మ శంకుస్థాపన

పాలకోడేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో క్రియాశీలకంగా వ్యవహరించిన కార్యకర్తల కుటుంబాలకు కష్టకాలంలో అండగా ఉంటామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం గొల్లలకోడేరులో బీజేపీ సీనియర్ కార్యకర్త దివంగత మెట్ట లక్ష్మీ శ్రీనివాస్ కుటుంబానికి ఇంటి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పార్టీలో కీలకంగా వ్యవహరించిన సీనియర్ కార్యకర్త మెట్ట లక్ష్మీశ్రీనివాస్ 2021లో కరోనా కారణంగా మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని భావించిన వర్మ సతీసమేతంగా వెళ్లి గొల్లలకోడేరులో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కలిదిండి వినోద్‌వర్మ, తోట గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడులో భగవద్గీత కంఠస్థ పోటీలు

ఆకివీడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. 18-45 ఏళ్ల వారికి 'నిత్య జీవితంలో భగవద్గీత - భావ విశ్లేషణపై పోటీలు నిర్వహించామని సమన్వయకర్త లంకా నాగ శశికళ తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



భీమవరంలో కేకు కట్ చేస్తున్న కలెక్టర్, పితాని



గణపవరంలో సత్యసాయికి భక్తుల పూజలు



తణుకులో సత్యసాయి వ్రతాలు



భజనల్లో పాల్గొన్న పాలకొల్లు ఆలయ దాతలు

భగవత్ స్వరూపుడు సత్యసాయి : కలెక్టర్

» ఘనంగా శత జయంతి వేడుకలు » పలుచోట్ల ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు



సిద్ధాంతంలో బాబా గ్రామోత్సవం

భీమవరం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్య సాయి బాబా సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస వంటి ధర్మాలను ఆచరించి భగవత్ స్వరూపుడిగా పూజలందుకుంటున్నారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకొని భీమవరం శ్రీ సత్య సాయి బాబా మందిరంలో బాబా జయంతి వేడుకలు నిర్వహించారు. బాబా చిత్రపటానికి కలెక్టర్, ఆచంట ఎమ్మెల్యే పితాని, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి తదితరులు పూలమాల వేసి బాబాను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని, కలెక్టర్ నాగరాణి, జేసీ టి. రాహుల్ కుమార్ రెడ్డి, సత్య సాయిబాబా సేవా సంస్థ సభ్యులు సత్య సాయి బాబా శత వార్షిక లోగో, 2025 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం సేవా సమితి కలెక్టర్‌ను, జేసీని ఘనంగా సత్కరించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం కన్యాకపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో భగవాన్ శ్రీసత్యసాయి శత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎంపీడీఓ బేబి శ్రీలక్ష్మి, పురప్రముఖులు వంకాయల రామారావు, మాజేటి సురేశ్‌కుమార్, శ్రేష్ఠి, సత్యసాయి సత్సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెంటపాడు: పుట్టపర్తి సత్య సాయి బాబా సేవలు మరువలేనివని ఎంపీడీవో రాంప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిషత్ ఆధ్వర్యంలో బాబా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈవోపీ ఆర్‌డీ ప్రసాద్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు సంతోష్‌కుమార్, సీతారామ రాజు, నాయకులు కసిరెడ్డి మధులత, కట్టుబోయిన కృష్ణప్రసాద్, కొణతల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు: తణుకు శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, పిల్లలకు చలికోట్లను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణతో పంపిణీ జరిగినట్టు నిర్వాహకులు తెలిపారు. మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు బట్టలు, దుప్పట్లు, అందజేశారు. సత్యసాయి వ్రతాలు, బాలవికాస్ పిల్లలకు క్విజ్, కేక్ కటింగ్ అనంతరం ఊయల సేవ నిర్వహించారు.

● సత్యసాయిబాబా సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస వంటి ధర్మాలను ఆచరించి ప్రపంచ వ్యాప్తంగా భగవంతుడిగా పూజలందుకుంటున్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి ఒక ప్రకటనలో కీర్తించారు. అనేక గ్రామాలకు తాగునీరందించిన అపర భగీరథుడు బాబా అన్నారు.

పాలకొల్లు అర్బన్: స్థానిక అచ్చుగట్లపాలెంలోని శ్రీసాయి గాయిత్రి ఆలయంలో భగవాన్ శ్రీసత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం నగర సంకీర్తన, నామ సంకీర్తనలు జరిగాయి. ఆలయ నిర్మాణదాత నాగుల కొండ గోపి సత్యనారాయణ, శాంతి రత్నం పాల్గొన్నారు. మధ్యాహ్నం నారాయణ సేవ జరిగింది.

పెనుగొండ: సిద్ధాంతంలోని చౌదరి రామాలయం వద్ద సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో భజనలు, మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహించారు. వంద మంది నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. భజన మండలి కన్వీనర్ ఆరుమిల్లి సాయి బాబా, బాల వికాస్ కన్వీనర్ సుజాత భక్తులు పాల్గొన్నారు.

కాళ్ల: కాళ్ళ తహసీల్దార్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి దోసిరెడ్డి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళ్ళ తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, ఎంపీడీవో జి.స్వాతి పాల్గొన్నారు.



కాళ్ళ తహసీల్దార్ కార్యాలయంలో..

రాజకీయాలకతీతంగా సమస్యల పరిష్కారం: వర్మ



క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వర్మ, ఎమ్మెల్యేలు అంజిబాబు, పితాని

భీమవరంటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భీమవరంలో నూతనంగా ఆధునిక సదుపాయాలతో నిర్మించిన తన క్యాంపు కార్యాలయం పనిచేస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలోని నరసయ్య అగ్రహారంలో నూతనంగా నిర్మించిన మంత్రి వర్మ క్యాంపు కార్యాలయాన్ని ఆదివారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పాండువ్వ శ్రీను తదితరులు కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎన్‌హెచ్-165 నిర్మాణానికి నిధులు, నరసాపురం నుండి వందే భారత్, నూతన రైలు సర్వీసులు సాధించడం జరిగిందని, రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆర్వోబీల నిర్మాణం, శ్మశానాల ఆధునీ కరణ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నిరంతరం ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించి, వాటిని సకాలంలో పరిష్కరిస్తామన్నారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కేంద్రం నుంచి నిధులను సాధించి పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న వర్మ మరో 20 ఏళ్లు నరసాపురం ఎంపీగా ఉండాలని తాను కోరుకుంటున్నానని అన్నారు. ప్రజల కోసం ప్రత్యేకంగా క్యాంపు కార్యాలయాన్ని నిర్మించడంతో పాటు, కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు తమ నియోజకవర్గాల అభివృద్ధికి కేటాయిస్తున్న వర్మ కృషి అభినందనీయమని ఎమ్మెల్యేలు అంజిబాబు, పితాని అన్నారు.

కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ గోపి మూర్తి, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరి, ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, టీడీపీ నాయకులు మెంటే పార్థసారథి, రామరాజు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు కూటమి నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.



పాఠశాలలో భూమిపూజ అనంతరం మాట్లాడుతున్న రఘురామ


మోడల్ హైస్కూల్‌గా తీర్చిదిద్దుతా: రఘురామ

ఉండి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎంతో ఘనకీర్తిగల ఉండి జడ్పీ హైస్కూల్‌ను జిల్లాలో మోడల్ హైస్కూల్‌గా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. ఆదివారం ఉండి జడ్పీ ఉన్నత పాఠశాలలో లేబోరేటరీల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు కలెక్టరు నాగరాణితో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణానికి సంబంధించి ఏర్పాటు చేసిన లోను మంజూరు యాప్‌ను ఉండి రాజులపేటలో డిజిటల్ అసిస్టెంట్ వద్ద కలెక్టరు పరిశీలించారు. స్థానిక పారిశుధ్య కార్మికులు తమకు ఇళ్లస్థలాలు, కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయించాలని కోరారు. పాలకోడేరు బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి, సర్పంచ్ సౌజన్యబెనర్జి తదితరులు పాల్గొన్నారు. ప్రజలంతా పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని డిప్యూటి స్పీకర్, కలెక్టరు అన్నారు. తడిచెత్త, పొడిచెత్తను వేయడానికి అవసరమైన డస్ట్‌బిన్‌లను వారు మహిళలకు అందజేశారు.

ఆకివీడు: ఆకివీడులో జాతీయ రహదారి వెంబడి సుమారు కిలోమీటరు పొడవునా రూ. 46 లక్షలతో నిర్మించబోయే సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి ఆదివారం డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు భూమిపూజ చేశారు. జాతీయ రహదారిపై నీరు నిలిచిపోవడంతో డ్రెయినేజీ తవ్వకానికి ఎమ్మెల్యే చొరవ చూపించారు. రానున్న రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. మోటుపల్లి ప్రసాద్, గంధం ఉమా, గొట్టుముక్కల సత్యనారాయణరాజు, నౌకట్ల రామారావు, గవర లక్ష్మీ, ముదునూరి నాగమణి పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై ఆగ్రహం

ఆకివీడు నడిబొడ్డున ఉన్న దొరగారి చెరువు తవ్వకం పనులను రఘురామకృష్ణంరాజు ఆదివారం పరిశీలించారు. కాంట్రాక్టర్ చెరువు లోతుగా తవ్వుతూ మట్టి తరలించడంపై స్థానిక నాయకులు డిప్యూటీ స్పీకర్ రఘురామ దృష్టికి తేగా ఆయన కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు తవ్వకంతోపాటు మిగిలిన మట్టిని బయటకు తరలించమని కాంట్రాక్టు ఇచ్చానేగాని, దీనిలో మట్టంతా అమ్ముకోమని ఇవ్వలేదని ఆగ్రహం ప్రదర్శించారు. శిరపు శ్రీను ఎమ్మెల్యేకు చెరువు వివరాలను పూర్తి స్థాయిలో వివరించారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

టీడీపీకి కంచుకోట యలమంచిలి : మంత్రి నిమ్మల

అట్టహాసంగా పార్టీ కమిటీల ప్రమాణస్వీకారం

పార్టీ శ్రేణులతో కలసి భారీ బైక్ ర్యాలీ

యలమంచిలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి యలమంచిలి మండలం చెక్కుచెదరని కంచుకోట అని.. తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానంటే యలమంచిలి మండల ప్రజల కీలకపాత్ర ఉందని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలిలో పార్టీ మండల కమిటీ, అనుబంధ విభాగాల నూతన కమిటీల ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. మంత్రి రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ప్రమాణస్వీకార సభలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. పాలకొల్లు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేలా అవిశ్రాంతంగా అభివృద్ధి, సంక్షేమం దిశగా పనిచేస్తున్నానని.. ప్రజలు కూడా మంచిచేసే పార్టీని, నాయకులను ఆశీర్వదించాలని అన్నారు. అనంతరం మండల కమిటీ, అనుబంధ విభాగాల నూతన కమిటీలతో మంత్రి రామానాయుడు ప్రమాణస్వీకారం చేయించారు. టిడీపీ మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా మామిడిశెట్టి పెద్దిరాజు, కార్యదర్శిగా ముచ్చర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా తమ్మినీడి వెంకట సత్యశ్రీనివాస్, మండల యువత అధ్యక్షుడిగా బొప్పన రాంబాబు, మండల రైతు అధ్యక్షుడిగా చెరుకూరి అంజిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పాలపర్తి మాధవరావు, బీసీ సెల్ అధ్యక్షుడిగా గుబ్బల ఏడుకొండలు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, నియోజకవర్గ పరిశీలకుడు పెచ్చెట్టి చంద్రమౌళి, ఆరుమిల్లి రామశ్రీనివాస్, బొప్పన హరికిషోర్, కడలి గోపాలరావు, మాతా రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

మాపై దౌర్జన్యం జరిగిందనడం అవాస్తవం : ఎస్ఐ

భీమవరం క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ క్రైం నెంబర్ 176/2025 కేసులో నిందితుడైన గెడ్డపురం రమేష్‌ను ఈ నెల 21న తాను, సిబ్బంది కలిసి తెలంగాణాలోని కామారెడ్డి జిల్లా మద్దిగుంట గ్రామానికి వెళ్లి అరెస్ట్ చేసి లోకల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి అరెస్ట్ సమాచారం తెలియపరిచామని ఎస్ఐ వీర్రాజు తెలిపారు. అయితే నిందితుడు రమేష్ బంధువులు కొందరు ఆంధ్ర పోలీసులకు రమేష్‌ను అప్పగించడానికి వీల్లేదని, తెలంగాణా పోలీసులతో గొడవ పడి వారి విధులకు ఆటంకం కలిగించడంతో రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుపై వారిపై కేసు నమోదు చేశారని తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుడు రమేష్‌ను తీసుకుని 22వ తేదీన భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిందితుడికి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించి భీమవరం కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారన్నారు. తదుపరి నిందితుడిని భీమవరం సబ్ జైల్‌లో అప్పగించామని, అయితే భీమవరం రూరల్ పోలీసులపై అక్కడివారు దౌర్జన్యం చేశారని కొన్ని ప్రసార మాధ్యమాల్లో వస్తోందని, అది వాస్తవం కాదని, ఎటువంటి దౌర్జన్యం జరగలేదని ఎస్ఐ వీర్రాజు తెలిపారు.

ధాన్యం అమ్మకాల్లో జిల్లాకో ధర !

(5వ పేజీ తరువాయి)

రైతులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో సొసైటీలు, సివిల్ సప్లై శాఖల ఆధ్వర్యంలో ఉన్న కాటాలను కాదని రైస్ మిల్లుల వద్దే తూకాలు వేయడం వలన మోసాలు జరిగే అవకాశం వుందని రైతులు పేర్కొంటున్నారు.

బస్తాకు రూ. 100 నష్టపోతున్నాం...

పొరుగున ఉన్న తూర్పు గోదావరి జిల్లాలో మా బంధువుల ధాన్యాన్ని రైస్ మిల్లర్లు రైతు కళ్లం వద్దే, మిల్లర్ల వాహనాలతో బస్తాకు రూ.1800 చెల్లించి తరలించారు. ఇక్కడ మాత్రం రైతుల సొంత వాహనాల్లో, సొంత కూలీలతో రైస్ మిల్లులకు తరలిస్తే రూ. 1700 చెల్లిస్తున్నారు. పొరుగు జిల్లా కంటే బస్తాకు రూ. 100 తక్కువగా తేడా వస్తుందంటే చాలా బాధగా వుంది.

-యడ్లపల్లి సూర్య ప్రకాశరావు, రైతు మండపాక, తణుకు మండలం.

ధర ఎక్కువ వస్తే ఎక్కడైనా అమ్ముకోవచ్చు...

సివిల్ సప్లయ్ ద్వారా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లలకు తరిలిస్తున్నది. కాబట్టి వాహనాలు, కూలీలకు మిల్లులకు సంబంధం లేదు.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు దరకంటే ఎక్కువ ధరకు రైతులు ఎక్కడైనా, ఎవరికైనా అమ్ముకోవచ్చు.

-వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి, భీమవరం.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : పితాని



పోడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యమే ధ్యేయం గా ప్రభుత్వం పనిచేస్తుం దని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్య నారా యణ అన్నారు. ఆదివారం కొమ్ముచిక్కాలలోని క్యాంపు కార్యాల యంలో ఇటీవల అత్యవసర వైద్యం చేయించుకున్న ఆరుగురుకి సీఎం సహాయ నిధి రూ.16లక్షల 20వేలు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు అందుబాటులో అన్ని రకాల వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కవిటం సొసైటీ అధ్యక్షుడు ఊడిగ శ్రీనివాసరావు, గ్రామటీడీపీ అధ్యక్షుడు గుబ్బల అప్పన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.



తణుకు సమరయోధుల పార్కు వద్ద మాంటిస్సోరి విద్యార్థుల సెల్యూట్

ఘనంగా ఎన్‌సీసీ డే

తణుకు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ దినోత్సవం పురస్కరించుకుని తణుకు మాంటిస్సోరి స్కూల్, జూనియర్ కాలేజ్‌లో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. త్రివర్ణ పతాకాలతో ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమరయోధుల పార్కు వద్ద జాతీయ జెండాలతో సెల్యూట్ చేశారు. పాఠశాల డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు పాల్గొన్నారు. ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ఎన్‌సీసీ విభాగం, జడ్పీ హైస్కూలు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీ బాయ్, ఎన్‌సీసీ కేర్ టేకర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ గణపతి సాయి పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ యూనిట్ వన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కొత్తపల్లి గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. తొలిరోజు క్యాంప్ ప్రారంభోత్సవంలో సర్పంచ్ మద్దాల రత్నకుమారి ముఖ్య అతిథిగా మాట్లాడు తూ విద్యార్థులు కొత్తపల్లి గ్రామాన్ని ఎన్నుకోవడం శుభపరిణామం అని, గ్రామస్థులకు పచ్చదనం, పరిశుభ్రత, వ్యాధుల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా తమ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గ్రామంలోని పాఠశాల ల్లో తాగునీటి కుళాయిలు శుభ్రం చేసే కార్యక్ర మాన్ని చేపట్టారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నిర్మలకుమారి ప్రోగ్రాం అధికారి జీ.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని 7 ఆంధ్రా నేవి యూనిట్‌లో ఆదివారం యూనిట్ కమాండర్ రోహిత్‌కుమార్ ఎన్‌సీసీడే వారోత్సవాలను ప్రారంభించారు. పరిసరాల పరిశుభ్రం, చెట్ల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ పట్టణంలో ఎన్‌సీసీ కేడెట్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు.



క్రీస్తు బోధనలు అనుసరణీయం

కాళ్ళ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని సంఘ కాపరి పి. పీటర్ అన్నారు. వేంపాడు సెయింట్ పాల్ లూథరన్ దేవాలయంలో సండే స్కూల్ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ సండే స్కూల్ మొట్టమొదటిగా ఇంగ్లాండ్ దేశంలో 1780 సంవత్సరంలో రాబర్ట్ రైకిస్ ప్రారంభించారని, భారతదేశంలో 1905లో ప్రారంభించారన్నారు. సండే స్కూల్ బాలలు క్రమశిక్షణతో చిన్నతనం నుంచి పెరిగితే దేశానికి, సంఘానికి ఉపయోగపడే పౌరులుగా ఉంటారని తెలిపారు. సండే స్కూల్ టీచర్స్ మేరీకుమారి సండే స్కూల్ బాలబాలికలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో నీతి కథల బోధన

భీమవరంటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో చదవడం మా కిష్టం కార్యక్రమంలో భాగంగా రిసోర్స్ పర్సన్ ఎం. రవికుమార్ నీతి కథలను విద్యార్థులకు బోధించారు. గ్రంథాలయ అధికారి ఎస్ వెంకటేశ్వర రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు వెండి గరగల బహూకరణ



ఆచంట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పెదమల్లం శ్రీ మాచేనమ్మ పల్లాలమ్మ అమ్మవారికి సంబంధించి భక్తులు, దాతలు ఇచ్చిన సుమారు 9 కేజీల వెండితో కోట్లమ్మ మారెమ్మ అమ్మవార్లకు రెండు గరగలు తయారు చేయించి వీటిని ఆదివారం ప్రత్యేక పూజలు చేసి అమ్మవార్లకు సమర్పించారు.

బైక్ నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి



శాశ్వత సభ్యత్వం తీసుకున్న దంపతులకు సత్కారం

పెనుమంట్ర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిల్లలు బైకులు నడపడంలో జాగ్రత్తలు పాటించాలని మార్టేరు విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ బోడపాటి సోమేశ్వరరావు, నెగ్గిపూడి మోడల్ స్కూల్ టీచర్ జయశ్రీ దంపతులు అన్నారు. ఆదివారం స్థానిక మానవతా సంస్థకు రూ. 25 వేల విరాళాన్ని సంస్థలో శాశ్వత సభ్యత్వం కింద, ఇటీవల బైకు ప్రమాదంలో అకాల మరణం చెందిన వారి కుమారుడు బోడపాటి నర్సింహ సాయి ప్రణీత్ పేరిట అందజేశారు.